పూడికతీత పూర్తయ్యేనా?

- మున్సిపల్‌లో ఇటీవల ముగిసిన డ్రెయినేజీ పూడికతీత టెండర్లు
- సుమారు రూ.60 లక్షల నిధులు కేటాయింపు

నగరంలోని డ్రెయినేజీలు పూడికతో నిండిపోయి అధ్వానంగా మారాయి. వర్షాలు కురిస్తే చాలు డ్రెయినేజీలోని మురుగునీరు రోడ్లపై పారుతోంది. ఈక్రమంలో నగర మున్సిపల్ అధికారులు ఇటీవల డ్రెయినేజీ పూడికతీత పనుల కోసం టెండర్లు నిర్వహించి, కాంట్రాక్టర్‌కు పనులను అప్పగించారు. గతంలో పనులు సక్రమంగా జరుగకపోవడంతో ఈసారైనా పనులు పూర్తయ్యేనా అంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు.



నగరంలోని హైదరాబాద్ రోడ్డు పక్కన అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

కార్పొరేషన్ రిపోర్ట్

నిజామాబాద్‌నాగారం: వర్షాలు కురిస్తే చాలు నగర ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ నగరం చిన్నపాటి వర్షాలకే జలమయంగా మారుతుంది. అలాగే డ్రెయినేజీల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో వర్షాలు కురిసినపుడు నీరు రోడ్లపై పారుతోంది. దీంతో సమస్య పరిష్కారం కోసం మున్సిపల్‌శాఖ బడ్జెట్‌లో పూడికతీత పనులకు ప్రతి ఏడాది సుమారుగా రూ.60లక్షలపైనే నిధులు కేటాయిస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం కూడా నిధులు కేటాయించడంతో ఇటీవల టెండర్ ప్రక్రియను ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పూర్తి చేసి, కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు..

ఇదీ పరిస్థితి..

నగరంలో 60 డివిజన్లు ఉండగా, 6 జోన్ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో జోన్‌లో పూడికతీత కోసం సుమారుగా రూ. 8లక్షల నుంచి రూ. 12లక్షల వరకు నిధులు కేటాయించారు. నాలుగో జోన్ పెద్దది కావడంతో రూ. 20లక్షల వరకు కేటాయించినట్లు తెలిసింది. మొత్తం సుమారుగా రూ. 60లక్షల నిధులతో ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో పూడిక తీత పనులు జరగనున్నాయి. కానీ శివారు కాలనీలు ఆటో నగర్, ధర్మపురిహిల్స్, నాగారం, అర్సపల్లి, చంద్రశేఖర్‌కాలనీ, గౌతంనగర్, దుబ్బ తదితర ప్రాంతాల్లో చిన్నపాటి వర్షాలకే ఆయా కాలనీల్లో నీరు వచ్చి చేరుతుంది. కాలువలు సక్రమంగా లేకపోవడమే ప్రధాన కారణం. డ్రెయినేజీ వ్యవస్థ ఇప్పటికీ చాల చోట్ల అస్తవ్యస్తంగా ఉంది. డీ-51, డీ-52, డీ-53, డీ-54 కెనాల్స్, పూలాంగ్ లాంటి వాగులు సైతం కబ్జాలతో చిన్న చిన్న కాలువల మాదిరిగా మారిపోయాయి. దీంతో నగరంలోని ప్రధాన ప్రాంతాలైన బస్టాండ్, ఖలీల్‌వాడీ, రైల్వేస్టేషన్, పూలాంగ్, బోధన్ రోడ్ తదితర ప్రాంతాలు వర్షాలు పడితే చెరువులు, కుంటలు తలపించేలా నీరు నిల్వ ఉంటుంది.

నగరంలో కాలువలు ఇలా (కి.మీ.లలో)

450	220	15
పక్కా డ్రెయినేజీలు	కచ్చా కాలువలు	వరద కాలువలు

గతంలో లెస్‌లో టెండర్..

గత ఏడాది ఒకే కాంట్రాక్టర్ 27శాతం లెస్‌లో టెండర్ వేసి, పనులు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ప్రకారం లెస్‌లో టెండర్ వేస్తే రద్దు చేసి మళ్లీ రీటెండర్ వేయాల్సి ఉంటుంది. అలా చేయకుండా సదరు కాంట్రాక్టర్ కొంతమంది అధికారులకు ముడుపులు అప్పగించడంతో పనులు సైతం మమా అనిపించేశారని ఆరోపణలు వినవస్తున్నాయి. దీంతో ఈసారైనా పనులు పకడ్బందీగా చేయించాలని నగర ప్రజలు కోరుతున్నారు.

పనులు పక్కగా చేయాల్సిందే..

నగరంలో పూడికతీత పనుల్లో ఖచ్చితంగా నాణ్యత ప్రమాణాలు పాటించాల్సిందే. కాంట్రాక్టర్లు పనులు సక్రమంగా చేయకుంటే శాఖపరమైన చర్యలు ఉంటాయి. ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయో పరిశీలన చేయాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

– మురళిమోహన్, ఇంజినీరింగ్ ఈఈ, నిజామాబాద్

నేటి చిత్రం..



డివైడర్లు లేని కంఠేశ్వర్ బైపాస్ రోడ్డు

బైపాస్ రోడ్డుపై డివైడర్ ఏదీ?

నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ నుంచి మాధవనగర్ వరకు ఉన్న బైపాస్ రోడ్డుపై డివైడర్ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రమాదాలు జరుగక ముందే అధికారులు స్పందించి, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి, విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఐటీ హబ్ అభివృద్ధికి కృషి చేస్తా

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ఐటీ హబ్ సిబ్బందితో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఐటీ హబ్ అభివృద్ధికి, అలాగే ఇక్కడ ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చారు. నగరంలోని బైపాస్ వద్ద గల ఐటీ హబ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసిన నిజామాబాద్ ఐటీ హబ్‌పై గత పాలకులు దృష్టి పెట్టకపోవడంతో కంపెనీలను తీసుకురావడంలో విఫలం అయ్యారన్నారు. 671 సీటింగ్ కెపాసిటీ ఉన్న ఈ ఐటీ హబ్‌లో 313 మాత్రమే పూర్తయ్యాయన్నారు. రాబోయే రోజుల్లో టాప్ కంపెనీలతో మాట్లాడి నిజామాబాద్ ఐటి హబ్‌కు తీసుకొచ్చేవిధంగా కృషి చేస్తానన్నారు. సమస్యలను ప్రస్తుత ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఐటీహబ్‌లో రాత్రి పనిచేసే వారికి బస్సు సౌకర్యం కావాలని ఎమ్మెల్యేను హబ్ ప్రతినిధులు కోరారు. డిపో మేనేజర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, కార్పొరేటర్లు ఇల్లెందుల మమతా ప్రభాకర్, పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, మాయావర్ సావితరాజ్, మీసేవ శ్రీనివాస్, మెట్టు విజయ్, గడ్డం రాజు, నాయకులు భాస్కర్, పవన్, ఆనంద్, రాజేందర్, కృష్ణ, హరీష్, సాయి, బాబీ సింగ్, కోవారమేష్, రంజిత్, సాయిరామ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ధర్పల్లి: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కళాజాత సిబ్బంది సూచించారు. మండల కేంద్రంలో గురువారం నిజామాబాద్ సాంస్కతిక శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందం ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అందరు నిష్పక్షపాతంగా, నిజాయితీగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

నిబంధనలు పాటించని బడిపై చర్యలు తీసుకోవాలి



నిజామాబాద్‌అర్బన్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం నగరంలోని డీఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ ప్రతినిధులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



జక్రాన్‌పల్లి: సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని, అలాగే చట్టానికి లోబడి ప్రవర్తించాలని ఎస్సై తిరుపతి సూచించారు. మండలంలోని పడకల్ గ్రామంలో గురువారం ఆయన చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధి కమిటీలు కేవలం గ్రామంలో అభివృద్ధి పనులను చేపట్టాలన్నారు. ఎవరికైన జరిమానాలు, సాంఘీక బహిష్కరణలు చేయకూడదని తెలిపారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

విచారణ కమిటీ వేయాలి



నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో రూ.18 కోట్లతో నిర్మిస్తున్న సైన్స్ బిల్డింగ్ పనులపై విచారణ కమిటీ వేయాలని పీడీఎస్‌యూ నాయకులు జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరికి వినతిపత్రం అందించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో జరగడం లేదని, నత్తనడకన సాగుతున్నాయని ఆయన ఆరోపించారు. నాయకులు రవీందర్, దేవిక, అక్షయ్, ఆకాష్, రాకేష్, లహరి పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



ఇందల్వాయి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత తెలిపారు. మండలంలోని లోలం రైతు వేదికలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులు, శిశువుల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీకాలు, పౌష్టికాహారం తదితర అంశాలను వివరించారు. వైద్య సిబ్బంది శంకర్ ఉన్నారు

విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండాలి



నిజామాబాద్ రూరల్: విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు ఉండాలని జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు. మండలంలోని మల్లారం గ్రామ శివారులో గల మేఘన డెంటల్ కళాశాలలో గురువారం ప్రపథమంగా నేషనల్ డెంటల్ కన్వెన్షన్ నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చదువు ఎంత అవసరమో క్రీడలు కూడా అంతే అవసరమన్నారు. అందుకే చదువుతోపాటు క్రీడలకు కూడా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల నుంచి క్రీడాపోటీల్లో పాల్గొనడానికి 1200 మంది హాజరయ్యారని తెలిపారు. మేఘన డెంటల్ కాలేజీ చైర్మన్ ఇషారి గణేష్, డైరెక్టర్ ఉమా మాగేష్, ప్రిన్సిపాల్ ముక్క ప్రతాప్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణ్ చక్రవర్తి, అధికారులు సాయిచంద్, సాంబ శివరావ్, లక్ష్మన్ పాల్గొన్నారు.

మంత్రి కృష్ణారావుకు ఘన స్వాగతం





కృష్ణారావుకు స్వాగతం పలుకుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి.. పూజలు నిర్వహిస్తున్న మంత్రి

ఇందల్వాయి: సిరికొండ మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాకు విచ్చేశారు. ఈసందర్భంగా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఆయనకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఘన స్వాగతం పలికారు. నాయకులు శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, ముప్పగంగారెడ్డి, నవీన్ గౌడ్, సంతోష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కర్స మోహన్, సుధాకర్, రాజు, చింతల కిషన్ ఉన్నారు.

ఆలయంలో మంత్రి పూజలు

ధర్పల్లి: మండల శివారులోని మద్దూల్ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని మంత్రి జూపల్లి కష్ణారావు సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా కవితా దినోత్సవం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో గురువారం సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'కవిత్వ నిర్మాణ మెలుకువలు' అనే అంశంపై కవి డా.కాసర్ల నరేశ్ రావు మాట్లాడారు. సాయిబాబు, వసంతాలక్ష్మణ్, సిర్ప లింగం, డా. శారద, దారం గంగాధర్, ధనుంజయ్, చెన్న శంకర్, హన్మాండ్లు తదితరులున్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఖలీల్‌వాడి: అన్ని రంగాల కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ అన్నారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ అధ్యక్షతన జిల్లా సమావేం నిర్వహించారు. సమావేశానికి ఆమె హాజరై, మాట్లాడారు. కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించేందుకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు.నాయకులు రమేష్ బాబు, నూర్జహాన్, ఈవీఎల్ నారాయణ, నన్నేసాబ్, మోహన్, రేణుక, బాలమణి, సుకన్య, స్వప్న, సాహేరా బేగం పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని కులాస్‌పూర్‌లో గురువారం ఘనంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ముగియడంతో గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి బోనాలను అమ్మవారికి సమర్పించారు. నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిజామాబాద్‌రూరల్: తెలంగాణ యూనివర్సిటీలో గురువారం పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'భారతదేశ ప్రస్తుత పరిస్థితులు– భగత్ సింగ్ ఆలోచనలో పరిష్కారం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతి సందర్భంగా ఈపోటీలు నిర్వహించినట్లు పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు.

పన్నులు చెల్లించాలి

వర్ని(మోస్రా): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బకాయి ఉన్న ఇంటి పన్నులను మార్చి నెలాఖరిలోపు చెల్లించాలని మోస్రా ఎంపీవో రఫీ ప్రజలను కోరారు. గురువారం మోస్రా మండల కేంద్రంలో పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యదర్శులు ప్రేమ్ , కృష్ణ ఉన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నవీపేటలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాగలత ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ఎస్టీ-1, 7వ తరగతి ఎస్సీ-1, మైనార్టీ విభాగంలో-2 , 8వ తరగతిలో ఎస్సీ-1, బీసీ-1, మైనార్టీలో-2, 9వ తరగతిలో ఎస్టీ-1, మైనార్టీ-1సీటు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో గురువారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీ చైర్మన్‌గా బైండ్ల రాధ, మెంబర్ కన్వీనర్‌గా జంగం అశోక్, 15 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

పశువులకు టీకాలు

జక్రాన్‌పల్లి: మండలంలోని మునిపల్లి గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను మండల పశువైద్యాధికారిణి శిరీషా వేశారు. గోపాల మిత్ర రాజ్‌కుమార్, అశోక్, పశువైద్య సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సిరికొండ: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు సత్యశోధక్ పాఠశాల విద్యార్థి వర్షిత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ నెల 23 నుంచి జరిగే అండర్-14 విభాగంలో వర్షిత్ పాల్గొంటాడని ఆయన తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థిని గురువారం ఉపాధ్యాయులు గంగారెడ్డి, అనిల్, సంతోష్, శ్రీనివాస్, ప్రిన్సిపాల్ అభినందించారు.

ఘనంగా రామకృష్ణ జయంతి



నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని జ్ఞాన సరస్వతి ప్రభుత్వ నృత్య పాఠశాలలో గురువారం దివంగత పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు నృత్యాంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. ప్రిన్సిపాల్ సరిత, బోధన సిబ్బంది అనిత, స్వప్నరాణి, జయప్రద ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు


నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర నూతన గవర్నర్ రాధాకృష్ణను గురువారం హైదరాబాద్‌లో రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రాజశేఖర్, ఈవీ శ్రీనివాస్, రమేష్, సంజీవరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు అభినందన



జక్రాన్‌పల్లి: రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని గురువారం తొర్లికొండ కాంగ్రెస్ నాయకులు కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాయకులు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, పార్టీ గ్రామ కార్యదర్శి వినోద్, నాయకులు గంగారెడ్డి, సంకెపల్లి వంశీ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన చింతలూర్ గ్రామస్తులు



జక్రాన్‌పల్లి: రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని గురువారం చింతలూర్ గ్రామస్తులు కలిశారు. నిజామాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యేను కలిసి రామడుగు ప్రాజెక్టు నీళ్లు వదలాలని కోరారు. వెంటనే ఎమ్మెల్యే రామడుగు ప్రాజెక్టు అధికారులతో ఫోన్‌లో మాట్లాడటంతో నీటిని వదిలారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేను సత్కరించారు. కొలిప్యాక్ సొసైటీ చైర్మన్ నాగుల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పుప్పాల గంగాధర్, అఖిలాష్, హన్మండ్లు, వీడీసీ సభ్యులు శ్రీనివాస్, శేఖర్, చిన్నరెడ్డి, గంగాధర్, బాజన్న తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో క్లబ్‌ఫుట్‌పై సదస్సు



నిజామాబాద్ నాగారం: నగరంలోని జీజీహెచ్‌లో గురువారం పిల్లల్లో పుట్టు కతో లోపంగా ఉండే క్లబ్‌ఫుట్ (వంకర పాదాలు)వ్యాధి- సమస్యలు, చికిత్స విధానాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమెరికా నుంచి విచ్చేసిన డా.కార్లటన్ బ్రూస్ స్మిత్ హాజరై, మాట్లాడారు. సదస్సులో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరా, వైద్యులు నరేంద్ర కుమార్, నాగేశ్వరరావు, పిఎల్ శ్రీనివాస్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో గురువారం ఎస్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమ కరపత్రాలను ప్రొఫెసర్ కనకయ, సంఘ నాయకులు ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు కొమిర శ్రీశైలం, దత్తహరి, పుప్పాల రవి, రాజేందర్, నిరంజన్, అశ్విన్, విజయ్, ఉదయ్, మహేష్, అభినయ్ ఉన్నారు.

డౌన్ సింద్రోమ్‌పై అవగాహన



నిజామాబాద్‌నాగారం: నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీలో గురువారం ఇందూరు అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, ఇందూర్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ డౌన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్ 'డౌన్ సింద్రోమ్'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పుట్టుకతో శరీరానికి కావలసిన హార్మోన్ సింద్రోమ్‌లు తక్కువగా ఉండడం వల్ల చిన్నారులు డౌన్ సింద్రోమ్ బారిన పడి శారీరక, మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. అలాంటి పిల్లలకు మనోధైర్యాన్ని ఇవ్వాలని తెలిపారు. వైద్యులు శ్రీకాంత్, నేతి బాలేష్, శ్రీశైలం మాట్లాడుతూ.. డౌన్ సింద్రోమ్ సమస్యను అధిగమించాలంటే ఏ బీ సీ డీ అనే పద్ధతిలో నియంత్రించవచ్చన్నారు. సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	68,200	వెండి (కిలో)	79,500
22 క్యారెట్స్	62,900	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	08	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	50	80
జీరకాయ	40	60	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	70
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	10	20	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	50	70	గోరుచిక్కుడు	50	70
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

సమాచారం..

నేటి నుంచి భగవద్గీత తరగతులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని వర్నిరోడ్డు సాయినగర్ ఎస్ జనార్ధన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో నేటి నుంచి ఈనెల 25 వరకు భగవద్గీతలోని శ్లోకాలపై ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే శాస్త్రీయ నృత్యం ఐదు ప్రసిద్ధ పాటలపై, భారతీయ చిత్రకళ ఐదు శైలులలో నేర్పించబడుతుందన్నారు. తరగతులు సాయంత్రం 5నుంచి రాత్రి 7గంటల వరకు జరుగుతాయని, ఆసక్తిగల వారు పాల్గొనాలని, ఎటువంటి ఫీజు ఉండదని తెలిపారు. వివరాలకు 94403 38370, 85004 78533, 96035 04228, 98486 86323ను సంప్రదించాలన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: ఓం భీమ్ బుష్ (తెలుగు) - 11.00, 1.45, 4.50, 7.30, 10.30
- స్క్రీన్-2: లైన్‌మన్ (తెలుగు) - 1.40, ప్రేమలు (తెలుగు) - 4.30, 10.30, భీమా (తెలుగు) 7.40.
- స్క్రీన్-3: రజాకార్ (తెలుగు) - 10.30, 1.35, 4.35, 10.40, లైన్‌మన్ - 7.45

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: ఓం భీమ్ బుష్ (తెలుగు) - 12.40, 3.50, 7.00, 10.10
- స్క్రీన్-2: కుంగ్ ఫూ పాండా (ఇంగ్లీష్) - 5.10, 7.30, ప్రేమలు (తెలుగు) - 1.30 సైతాన్ (హిందీ) - 9.50
- స్క్రీన్-3: లైన్‌మన్ (తెలుగు) - 10.00, ప్రేమలు (తెలుగు) - 6.45, సైతాన్ (హిందీ) - 12.45 యోధ (హిందీ) - 3.45
- స్క్రీన్-4: గామి (తెలుగు) - 3.20 రజాకార్ (తెలుగు) - 12.05, 7.00, 10.20

- దేవి: ప్రేమలు (తెలుగు)
- నటరాజ్: నువ్వు నేను
- లలితామహల్: ఓం భీమ్ బుష్ (తెలుగు)
- విజయ్: రజాకార్ (తెలుగు)

గుండారంలో ఎన్ఎస్ఎస్ శిబిరం



నిజామాబాద్ రూరల్: మండలంలోని గుండారం గ్రామంలో గిరిరాజ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతోంది. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ కవిత పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. సిబ్బంది అనిల్‌కుమార్, బాబు, సౌమ్య, సునీత పాల్గొన్నారు.

బ్రాహ్మణ్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో గురువారం ఆర్మూర్ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. ప్రోగ్రాం ఆఫీసర్ చైతన్యశాంతి మాట్లాడుతూ.. విద్యార్థినులకు చదువుతో పాటు సేవాభావం పెంపొందించడానికే ఈ శిబిరం ఏర్పాటు చేశామన్నారు. మాజీ సర్పంచ్ మాదరిలత దేవరాజ్, ఎంపీటీసీ పోతే రాజు, జీపీ కార్యదర్శి మహేష్, ఎన్ఎస్ఎస్ సభ్యురాలు బబిత పాల్గొన్నారు.